# 61. అపారే వ్యాపార పారావారే

"అందుకే, నాక్కూడా ఓ చిన్న ఉద్యోగం చూసిపెట్టండీ-అని ఏడాది నుంచీ మొత్తుకుంటున్నాను!" అది మా మేనకోడలు కాంతం కేక. తలుపు మూసి ఉన్నా స్పష్టంగా వినిపించింది.

మొగుడూ పెళ్ళాం డబ్బు చాలక అవస్థపడుతూ వుంటే నేనొకణ్ణి అతిథిగా వచ్చేనే అని నొచ్చుకుంటూనే తలుపుతట్టాను. "ఒస్తున్నా!" అని కొంచెం తక్కువ స్థాయిలో ఇంకో కేకపెట్టి తలుపు తీసింది కాంతం. "నువ్వా, మామయ్యా! రా. ఏదో దారి తప్పి ఒచ్చినట్టున్నావు!" అని మొహానికి నవ్వు రంగు పులుముకుంది.

చెప్పేను -

"మా ఆఫీసులో నాతోబాటే పని చేస్తున్న సుందర్రావు కూతురికి విజయవాడలో ఒక సంబంధం ఒచ్చింది. నిన్న రాత్రి పది గంటలకి విశాఖపట్నంలో బయలుదేరిన రైలుకి, తనే వద్దామని టిక్కెట్టు కొనుక్కున్నాడు. హటాత్తుగా వాళ్ల నాన్నగార్ని ఆస్పత్రిలో చేర్చవలసొచ్చింది. "పోనీ నా బదులు నువ్వు వెళ్ళి ఆ పార్టీ ఎలాంటి వాళ్లో స్థితి గతులేమిటో చూసిరా! అని నాకు పురమాయించేడు. పెళ్ళి కొడుక్కి ఈ వూళ్ళో ఏదో వ్యాపారం ఉందిట. అది సరే, పిల్లలేరీ? ఇంత పొద్దుటే ఎటెళ్ళారు?"

కాంతం నెత్తికొట్టుకుంది. "పిల్లలా, రాక్షసులా! ఏ జన్మానో శత్రువులు. పగ సాధించడానికి పుట్టుకొచ్చేరు." కాఫీ తెద్దామని కాబోలు, లోపలికెళ్ళింది.

"చూసేరా! ఇదీ వరస" అన్నాడు కృష్ణ. "పిల్లలకి చదువులు చెప్పించడానికి డబ్బు సరిపోవడం లేదని, ఆ చిరాకంతానూ. బాబు మూడో క్లాసులో కొచ్చేడు. పాపని ఎల్.కే.జీ.లో చేర్పించాలి."

"ఈ మాత్రం దానికేనా! నీకేదో మంచి ఉద్యోగమే ఉంది కదా. నెలకి రెండువేలు తెచ్చుకుంటున్నావన్నారే?"

"రెండు వేలేమి, దగ్గిర దగ్గిర మూడు వేలొస్తుంది. కానీ, ఈ లెవెల్లో వెళ్తే ఇంకో వెయ్యి రూపాయలైనా లేకపోతే కష్టం. అందుకని తాను కూడా ఏదైనా ఉద్యోగం చేస్తానంటుంది. రోజూ ఆఫీసుకి బయల్దేరే ముందూ, ఆఫీసు నుంచి రాగానే కూడా నా ఉద్యోగం మాటేమిటని నిలదీస్తుంది."

కాంతం అల్లంత దూరాన్నించే అరుస్తున్నట్టు బిగ్గరగా మాట్లాడుతూ వచ్చింది. "నేను నిలదియ్యడమే కనిపిస్తుంది. ఈ ఖర్చులకి తట్టుకోలేక ఆయన ఓవర్ టైమ్‌లు చేసీ పార్ట్ టయిమ్ జాబ్స్ చేసీ ఒళ్ళు గుల్ల చేసుకోవడం కనిపించదు. ఇప్పుడు బాబీకి పద్దెనిమిది వందలు కట్టి జాయిన్ చెయ్యాలి. పాపకి ఆరు వందలు. అసలు ఎల్.కే.జీ. అప్లికేషను ఫారమే వంద రూపాయలు పెట్టి కొన్నాం. ఎంట్రన్సు పరీక్షకి కోచింగ్ ఇవ్వడానికి రెండు వందలు పుచ్చు

కున్నారు."

"ఎల్.కే.జీ.కి ఎంట్రన్స్ పరీక్షా?" అన్నాను కాఫీ అందుకుంటూ.

"మరేమనుకున్నావు? ఎ.బి.సి.డి. నుంచి ఎక్స్.వై.జడ్ వరకూ ముందు నుంచి వెనక్కీ వెనక నుంచి ముందుకీ చెప్పడం రావాలిట. వన్-టు-త్రీ-అని మొదలు పెట్టి హండ్రడ్ వరకూ ఒక్క తప్పులేకుండా చెప్పాలిట. పిక్చర్ చూపించి వాటీజ్ దిస్ అంటే ఫిష్, బాల్, క్యాట్, డాగ్ అని చకచకా చెప్పాలిట. అలా చెప్పగలిగిన వాళ్ళనే ఎంట్రన్సులో పాస్ చేస్తారుట. మరి కోచింగు ఇవ్వకపోతే ఎలా చెప్పగలరు, ఈ మూడేసేళ్ళ పిల్లలు!"

"ఆ మాత్రం కోచింగు నువ్వు ఇవ్వగలవు కదా?"

"మనం ఇస్తే పనికి రాదుట. మనం ఏ స్కూలుకైతే అప్లయి చేస్తామో ఆ స్కూలువాళ్లే ఫలానా టీచర్ దగ్గిర ఎంట్రన్స్ కోచింగ్ తీసుకోవాలని నిర్ణయిస్తారు."

"అసలు నాకు 3,000 జీతం ఒస్తుందని సర్టిఫికేటు తెచ్చుకుంటేనే తప్పా అసలు అప్లికేషనే ఇవ్వలేదండీ!" అన్నాడు కృష్ణ

"ఇప్పుడు వాళ్లు కట్టమన్నంత డబ్బు కట్టి, వాళ్ళు కొనమంటున్న పుస్తకాలు వాళ్ళ దగ్గిరే కొనుక్కుని, వాళ్లు చెప్పిన బట్టల షాపులోనే యూనిఫారాలూ టైలూ కొనుక్కుని, వాళ్ళు చెప్పిన చెప్పుల షాపులోనే షూసూ, సాక్సూ కొనుక్కోవాలి. అప్లికేషన్ తెచ్చుకోడానికి ఒక రాత్రంతా ఆయనా నేనూ వంతులు వేసుకుని క్యూలో నుంచున్నాం, తెలుసా?"

మా కాంతం అత్తవారు కూడా మంచి స్థితి మంతులే. వాళ్ళది గుడివాడకీ బందరుకీ మధ్యని ఓ పల్లెటూరు. ఐదు ఎకరాల మాగాణి, ఊళ్ళో విశాలమైన ఇల్లు. "ఇలాంటి సమయంలో వాళ్ళని అడిగి కొంత డబ్బు తెచ్చుకుంటే - ఆపద తీరుతుంది కదా?" అన్నాను.

"అక్కడా ఏం మిగల్లేదు మామయ్యా. మా మరుదులు ఇద్దరికీ ఇంజినీరింగులో సీట్లు రాలేదని వరసగా రెండేళ్ళు రెండేసి ఎకరాల పొలం అమ్మేసి కర్నాటకాలో చేర్చారు. ఇంకా మా ఆడపడుచు పెళ్ళి ఒకటుంది. ఆ మిగిలిన ఎకరం భూమీ ఆ ఇల్లూ అమ్మినా సరిపోదేమో. నాకు పెళ్ళి చెయ్యకండి, నేను చదువుకుంటాను- అంది మా ఆడపడుచు. చదువుకన్నా పెళ్ళే చవకలో తేలిపోతుందని ఆ అమ్మాయిని చదవనియ్యలేదు."

"డొనేషన్లు కట్టించుకోవడం, ఫీజులు పెంచడం ఇప్పుడింకా అరాజకంగా వున్నాయి గాని ఇంకా కొన్నాళ్ళకి ఇవన్నీ పకడ్బందీగా చట్టబద్ధం అయిపోతాయి సార్" అన్నాడు కృష్ణ. "పదవుల్లో ఉన్న కొందరు రాజకీయ నాయకులకి విద్యా సంస్థలు ఉన్నాయి. వాళ్ల భవిష్యత్తు కోసం ఇలాంటి దురాచారాలని చట్టబద్ధం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఏర్పరచిన స్కూళ్ళలో చదివించు కోవాలంటే అక్కడ టీచర్ పోస్టులు చాలావరకు ఖాళీ. ఉన్న కొద్దిమందీ ట్యూషన్లతోనో స్వంత వ్యాపారాలతోనో సతమతం అవుతూ పాఠాలు శ్రద్ధగా చెప్పలేక పోతున్నారు, పాపం. అంచేత మూడో తరగతి పిల్లాడికి రెండు వేలూ, ఎల్.కే.జీ పిల్లకి ఆరు వందలూ కట్టాలన్నా కూడా ఈ పుట్టగొడుగు కాన్వెంటులకే పంపిస్తున్నారు జనం. పిల్లల చదువుల కోసం మధ్య

తరగతి వాళ్లని దేశం చెయ్యమంటున్న త్యాగం అపూర్వం, అపురూపం!"

"మా చిన్నతనంలో మూడో తరగతి వరకు చదువు ఫ్రీగా చెప్పేవారు. నాలుగో తరగతికీ ఐదో తరగతికీ నెలకి రూపాయి పావలా కట్టించుకొనేవారు. ఆరో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు నెలకి రెండు రూపాయల ముప్పావలా కట్టాలనే సరికి చాలామంది ఐదో తరగతితో చదువు ఆపేసుకునేవారు. తొమ్మిదో తరగతి నుండి పదకొండో తరగతి వరకు నెలకి ఐదు రూపాయల పావలా వసూలు చేస్తారు కదా అని కొందరు థర్డ్ ఫారం అంటే ఎనిమిదో తరగతితో చదువు చాలించుకునేవారు. చాగంటి సోమయాజులు గారు "ఎందుకు పారేస్తాను నాన్నా?" అనే కథ ఒకటి రాసేరు. ఆ కథ చిన్నప్పట్నించి ఈ అరవయ్యోపడి దాకా ఎన్నిమార్లు చదివినా అన్నిమాట్లూ కళ్లమ్మట నీళ్ల ఆగవు నాకు. ఆ కథలో కుర్రాడి చదువుకోసం తండ్రి చుట్టకాల్చడం అనే అలవాటుని త్యాగం చేస్తాడు. ఇప్పుడు మీలాంటి లక్షలాది మంది దంపతులు పిల్లల చదువుల కోసం చేస్తున్న త్యాగాలు చూస్తూ వుంటే ఏం అనాలో తెలీడం లేదు".

"నాకు టైమవుతోంది. సేట్ తోడర్‌మల్ కొట్లో ఎనిమిదిన్నర నుంచి పదిన్నర దాకా పనిచేసి అప్పుడు మా ఆఫీసుకి వెళ్లాలి." అని లేచేడు కృష్ణ. "మీరెళ్లవల్సింది ఎక్కడికి?" అని అడిగేడు. జేబులో ఉన్న ఎడ్రస్ ఓసారి తీసి చూసుకుని "నేను వెళ్ళగలనులే. ఇంకా స్నానం చెయ్యాలి కదా..." అని నేనూ లేచేను.

"పిల్లల్ని ఎవరికయినా వప్పగించి నువ్వు కూడా నాతో రానే, కాంతం! ఆ కుటుంబం, వాళ్ల సంప్రదాయం అవన్నీ చూద్దూగాని. అబ్బాయికి ఏదో వ్యాపారం అని చెప్పేరు. ఏం వ్యాపారమో, పిల్లకి రెండు పూట్లా ఇంత అన్నం పెట్టి ఏడాదికి ఒక చీరకొని ఇవ్వగలడో లేదో చూసి రమ్మన్నాడు సుందర్రావు" అన్నాను; స్నానం, టిఫినూ అయ్యేక.

"ఇంతకీ ఆ ఎడ్రస్ ఏమిటి?" అంది కాంతం. నేను నా జేబులోంచి చీటీ తీసి ఇచ్చేను.

"ఎస్. రవీంద్రనాథ్. గాంధీ ఫౌండేషన్ -" ఆ తరువాత చదవలేదు కాంతం. "మామయ్యా, మీ ఫ్రెండు కూతురెవరో, పెట్టి పుట్టింది. ఈ సంబంధం గానీ సెటిలయితే కోటీశ్వరుడి ఇల్లాలవుతుంది. వెనకా ముందూ చూడకుండా అడిగినంత కట్నం కోరినన్ని లాంచనాలూ ఇచ్చి పెళ్లి చేయించీ." అంది.

"నీకు వాళ్లు బాగా తెలుసా? ఏం వ్యాపారం వాళ్లది?"

కాంతం నవ్వి నవ్వి ఆనందంతో అలిసిపోయి కుర్చీలో కూలబడ్డాది. "రామాయణం అంతా విని - అన్నట్టుంది మామయ్యా, నీ ప్రశ్న. ఏం వ్యాపారమేమిటి? బంగారం, వెండి, వజ్రాలు, పొలాలు, స్థలాలు, ఆవకాయ - ఏ వ్యాపారం కూడా సాటికిరాని వ్యాపారం. గాంధీ ఫౌండేషన్ అంటే ఏమిటనుకున్నావు! పన్నెండు ట్యుటోరియల్ కాలేజీలు, ఇరవై కాన్వెంట్లు, రెండు రెసిడెన్షియల్ కాలేజీలు, ఐదు కోచింగ్ సెంటర్లు - ఇంకా ఎన్నో ఉన్నాయి వీళ్లకి. డబ్బు లెక్క పెట్టుకోడానికి ఒక పరకామణి లాంటి సెక్షనుంది. మా పిల్లల్ని మేం అక్కడేగా, చదివిస్తున్నాం!" అంది.

★